
# అపశ్రుతి

ఆచంట శారదాదేవి




గంగానది కలకల స్వనాలతో గానం చేస్తూ, చల్లగా సాగిపోతున్నది. మలయపవనుని బిగి కౌగిటిలో కదలిపోతూ తరులతలు గలగల పాడుతున్నవి. ఆనందాన్ని అంది పుచ్చుకొంటూ పక్షులన్నీ పరవశంతో అలాపిస్తున్నవి. దిశదిశల నుండి వచ్చి ఈ మధురగానం నా హృదయాన్ని నింపివేస్తున్నది. కానీ, నా హృదయంలో మాత్రం ఏ మూలో ఏదో అపశృతి. ఎంత మనోజ్ఞమైన రాగమైనా నాకు అపస్వరాలతో మిళితమౌతున్నది. తీయని పాట, తియ్యని మధువు నాకీ జీవితంలో కరువైనవి. శూన్యాన్ని తిలకిస్తూ శూన్యానికై నిరీక్షిస్తూ ఈ జీవితం యిట్లానే గడచిపోతుంది.


అమ్మ అంటుంది. 'చిరునవ్వులు వెదజల్లుతో అప్పుడే కన్ను తెరిచిన పాపలాగ విరిసిన పూవులాగ నిన్ను తిరిగి చూడగలనా ఈ జన్మలో' అని. నేను తొలిస్తారి నవ్వినది - నాకు ఇంకా ప్రస్ఫుటంగా జ్ఞాపకమున్నది. అప్పుడే తొలిసారి నిద్రమేల్కొన్నాను. కండ్ల ఎదుట అతను - దూరాన్నుంచి నాకేసే చూస్తూ చిరునవ్వు నవ్వాడు. ఎంత ఆప్యాయంగా ఎంత మనోహరంగా నవ్వుతాడు! కలత నిద్దురలో ఇది కలా, నిజమా అనుకున్నాను. నాకు తెలియకుండానే నా పెదవులు నవ్వటానికి ప్రయత్నించినవి. అదే నేను మొదటిసారి నవ్వినది. ఆరోజు మొదలు మేము ప్రతిరోజూ పలకరించుకుంటూ వుండేవాళ్లం.

ఒకరోజు ఒంటరిగా వుండగా అతను వచ్చాడు. అడగకుండానే 'నేను అంబర రాజకుమారుణ్ణి, నా పేరు చంద్రుడు' అన్నాడు. నేను బదులు పలకలేదు. హృదయమంతా, శరీరమంతా ఆనందంతో నిండిపోయినప్పుడు మాటలెలా వస్తాయి? అతను దగ్గరగా వచ్చి నా తల నిమిరాడు. వేరే ఏమీ చేయలేనట్లు నా తల అతని గుండెల మీద వాల్చాను. అతని హృదయం నాకు ఆశ్రయమిచ్చినట్లు తోచినది. జీవితమంతా యిట్లాగే తలపెట్టుకొని నిద్రపోతాను ఇంకేమీ కావాలనుకున్నాడు. జీవితంలో వేరే కోరుకోదగినదేమీ లేనట్లే తోచినది.

అతను ప్రతిదినమూ వచ్చేవాడు. ప్రతిరోజు నన్ను తనతో రమ్మనేవాడు. 'కలూ, నాతో రావూ, నీవులేని జీవితం ఎడారిలా వుంది. కలూ. నీవు నా రాణివి, నా మందిరంలోనే వుండటానికి అర్హురాలివి. నా ఇంటికి ఎప్పుడు వస్తావు?' ఇదే ధోరణి ఆకాశంలో స్వేచ్ఛగా విహరించే విహంగంలాగ దిక్కు దిక్కూ చూచుకుంటూ పోయే అతనికి నా బాధ, బంధన ఎట్లా అర్థమౌతుంది! అమ్మ నన్ను కదలనిస్తుందా? మాలతీలత ఏమంటుంది? మందారమాల నవ్వదూ? అందరూ కలువరాణి చంద్రునితో కలిసిపోయిందని అనుకోరూ! అప్పటికీ అమ్మతో అన్నాను. 'చంద్రుడు చాలా అందంగా వుంటాడు కాదూ!' అని. 'అయ్యో! వెర్రి తల్లీ! అంత పెద్ద మచ్చ నీకు కనపడలేదుటే' అని నవ్వింది. మచ్చా! అవును, నిజమే, అతని నుదుటి మీద పెద్ద మచ్చ. అయితే అది యిన్నాళ్లూ కనబడనేలేదే! మర్నాడు చంద్రుడు వచ్చాడు. అతను వున్నంతసేపు ఆ మచ్చ జ్ఞప్తికి రానేలేదు. ఆశ్చర్యం! దూరం కాగానే

మాత్రం ఆ మరక పెద్దదై భూమి అంతా ఆవరించుకొని నా ఆశలన్నీ అణగద్రొక్కుతూ నన్ను దుఃఖంలో ముంచెత్తుతుంది. ఇది ఎట్లా మరచిపోగలను. చివరకు అతనినే అడిగాను. 'ఎప్పుడూ నాతో వుంటే నీకు జ్ఞాపకం రానేరాదు రాణీ, నాతో రావూ' అన్నాడు. అదే నిజమనిపించింది. 'రోజా నిద్రపోతున్నా, మెలుకువతో వున్నా ప్రతి నిమిషం నీతోటే వుండాలని వున్నది' అన్నాను. ఆరోజే అతని దేశం వెళ్లిపోయినాను.

ఎంతో ప్రేమతో అతను తన ఇంటికి తీసుకు వెళ్లాడు. త్రోవ పొడుగునా మేఘబాలలు మాకు స్వాగతం ఇచ్చాయి. అతనిలాగా అతని అద్దాలమేడ ఎంత అందంగా వున్నది! అతనిలాగా అతనిని ఆశ్రయించిన వన్నీ సుకుమారంగానే వున్నవి. ఆనందంలో ప్రపంచంలో దుఃఖం వున్నదన్నమాటే మరిచి పోయినాను. బాహ్య ప్రపంచానికి దూరంగా అతని ఇంటిలో అతనిలో కలిసిపోయి వున్నాను. ఆ



పత్రికలో అచ్చు అయిన నా మొట్టమొదటి కథ 'అపశృతి'. ఇది 1946లో అప్పట్లో శ్రీ ఎస్.జి. ఆచార్య గారు, ఆయన భార్య అన్నపూర్ణాదేవిగారు నడుపుతున్న 'చిత్రాంగి' అన్న పత్రికలో అచ్చు అయినది. తరువాత ఇది 1960 ప్రాంతాలలో అచ్చు వేయబడిన నా మొదటి కథా సంపుటం 'పగడాలు'లో ప్రచురించ బడింది.

- ఆచంట శారదాదేవి

ఆనందం మత్తు కలిగించింది. ఆ తన్మయత్వంలో ఆ విశాలా వరణంలో నా స్థానమేదో కూడా విచారించుకోలేదు. ఆ ఇంటికి అతిథిగా వచ్చానా, గృహిణిగా వచ్చానా లేక చెలినై వచ్చానా ఇవి ఏవీ మనసుకు తట్టలేదు. అతని హృదయానికి తలనాన్చి పరవశమైపోతున్నాను. అతనలాగే ఆనందంలో మునిగిపోయినాడు. ఇరువురమూ ప్రపంచాన్నే మరిచి పోయినాము.

ఎవరో కిలకిలా నవ్వారు. అదిరిపడి తలయెత్తి చూశాను. ఆ నీలి అద్దాల మేడలో నీలాకాశంలోని నక్షత్రాలలాగా తళతళా మెరిసిపోతున్నారు. అబ్బా, ఎంతమందో! అందరూ నన్నుహేళన చేస్తున్నట్లుంది. చంద్రుడు తెల్లబోయి దిగులుగా చూస్తున్నాడు.

'వాళ్ళందరూ ఎవరు' మథనపడి మథనపడి చివరకు ధైర్యం తెచ్చుకొని అడిగాను. చంద్రుడు శాంతంగా జవాబు చెప్పాడు: 'అందరూ నా మిత్రులు, నా సహచరులు' ఆశ్చర్యం వేసింది. సహచరులా! ఇంతమందితో పరిచయం వున్నట్లు ఎప్పుడూ చెప్పలేదే!

'అందరూ నీదగ్గరే వుంటారా?' అనుమానిస్తూ అడిగాను.

'ఎప్పుడూ నాతో కూడానే వుంటారు. నన్ను విడిచిపెట్టి ఒక్క క్షణమైనా వుండలేరు.

నీలి అద్దాలలోని రంగు నా ముఖమంతా ఆవరించింది. ప్రపంచంలో వున్న దిగులంతా ఒక్కసారిగా నన్ను చుట్టుకొన్నది. ఇంతమంది మధ్య నేనెవర్ని, నాకేమి స్థానమున్నదిక్కడ - ఆఖరు ప్రయత్నంగా అడగలేక అడిగాను.

'వాళ్ళందరూ అంటే నీకు చాలా యిష్టమా?'

'ఆ! చాలా యిష్టం.'

నాక్రింద భూమి పగిలి నేను పాతాళానికి క్రుంగిపోతున్నట్లనిపించింది.

హృదయం వేసవి యెండవలె కనలిపోతున్నది. 'ఇంతమంది యిష్టమైనవాళ్ళుండగా నేనెందుకు కావలసి వచ్చాను?' దీనికి జవాబు లేదు. ఇది నాకప్పుడు అర్థం కాలేదు. ఎప్పుడూ అర్థం కాదేమో! ఎక్కడో విదేశాలలో అప్తులందరికీ దూరమై విపరీతానుభవాల మధ్య వున్నట్లనిపించింది. తీరని బెంగ ఆవహించింది. అమ్మ నాకోసం ఎంత బాధపడుతున్నదో! కొలనులో పూవులన్నీ నన్ను 'కలువరాణి కలువరాణీ' అని ఎంతగా ప్రేమిస్తాయి. అందరికీ దూరమైపోయినానుగదా అని దుఃఖం పొర్లు కొచ్చింది.

'చంద్రా నేను వెళ్ళిపోతున్నాను. ఇంతమంది వుండగా నీకు నా అవసరం ఏమున్నది. అమ్మకు నేను చాలా అవసరం. 'వీరందరితో కలిసిమెలిసి వుండలేకపోతే వెళ్ళవచ్చును.' ఎక్కడా విచారపడుతున్నట్లుగా కూడా కనపడలేదు. 'ఇంతమందిలో కలిసి ఎట్లా వుండగలను? అందరూ ప్రతి నిమిషము నాయెదుట తిరుగుతూ నన్ను వెక్కిరిస్తూ వుంటే అంతా ఎట్లా మరచిపోగలను? చంద్రుడు, నేను తప్ప ఇంకెవరూ లేరని ఎట్లా అనుకోగలను? నేను పోతున్నాను.'

చంద్రుడు మాట్లాడలేదు.

వాడిన పూవువలె నేలకు రాలిపోయినాను.

నిద్రలేచేసరికి అమ్మ ఒడిలో వున్నాను. అమ్మ తల నిమురుతూ వున్నది. ఆమె కళ్ళవెంట నీళ్ళు కారుతూ వున్నవి. 'అంతా మరిచిపో తల్లీ' అన్నది. అంతా మరిచిపోవటం ఈ జన్మలో సాధ్యం కాదు. చంద్రుడు ప్రతి నిమిషం నా ఎదుటనే వున్నాడు. సాయంత్రంవేళ పొదల మాటున వుండి దీనంగా చూస్తాడు. నడిరాత్రివేళ మబ్బుల మధ్యనుండి ఆదుర్దాగా తొంగిచూస్తాడు. నేను ఎక్కడికి వెళ్ళినా నాతో కూడానే వుంటాడు. అమ్మతో సముద్ర స్నానానికి వెళ్ళాను. కెరటాల మీద తేలిపోతున్నాడు చంద్రుడు. అయితే అతనికీ నాకూ వేయిమైళ్ల దూరం. ఇంక ఎప్పటికీ కలుసుకోలేనేమో! చంద్రునికి దూరమై పోయిననాటినుంచి నా హృదయంలో ఏదో అపశృతి కలిసిపోయినది. ఎంత తియ్యని సంగీతమైనా ఏదో అపశృతి. చల్లని గంగాజలంలో కూడా ఏదో వేడిమి; మధువులో కూడా ఏదో చిరు చేదు. ఈ జీవితమింతేనేమో!



## హస్తకళా ప్రవీణురాలు
## అరుణిమా బోస్

హైదరాబాదు స్టాన్లీ కళాశాల నుంచి బి.కాం పట్టభద్రురాలైన కుమారి పి. అరుణిమా బోస్ హాండీక్రాఫ్టు తయారీలో ఎంతో నైపుణ్యం సాధించారు. ఆమె తయారుచేసిన "పెన్ అండ్ త్రెడ్" పద్ధతిలోని "నెమలి" చిత్రం విశాఖలో పలువురిని ఎంతగానో ఆకర్షించి, ప్రశంసలనందుకున్నది.

ఆ చిత్రం చేసే విధానాన్ని ఆమె ఇక్కడ వివరిస్తున్నారు.

కావలసిన సామగ్రి :

అంగుళం మేకులు, బంగారు రంగు పాలీస్టర్ దారం, నీలి రంగు, ఆకుపచ్చ రంగు, గులాబీ రంగు గల చిప్పు, ప్లయివుడ్ బోర్డు, తెల్లరాళ్ళు, బోర్డు మీదకు నల్లటి ముఖమల్ వస్త్రం.

చేయవలసిన విధానం :

ప్లయివుడ్ మీద ముఖమల్ క్లాత్ ఫెవికాల్‌తో అంటించాలి. క్లాత్ మీద చిత్రించబోయే నెమలి బొమ్మను ట్రేసింగ్ తీసుకోవాలి. నెమలి బొమ్మ భాగాన్ని వదలివేసి, మిగతా భాగాన్నంతా అర అంగుళంలో దూరంలో అర అంగుళం మేకులు కొట్టుకోవాలి. ఒక మేకు నుంచి వేరొక మేకుకు, చిత్రంలో పూర్తిగా, బంగారు రంగు పోలీస్టరు దారంతో అల్లుకోవాలి. మేకులు కనబడకుండా నీలి రంగు చిప్పు అంటించాలి. నెమలి బొమ్మ లోపలి భాగంలో నీలి రంగు చిప్పు మాత్రమే అంటించాలి. కంటి దగ్గర తెల్లరాయి అంటించాలి. నెమలి బాడీ అవుట్‌లైన్ అంతా గోల్డ్ త్రెడ్ పెట్టుకుని, నెమలి బాడీ పార్ట్‌లో ఒక లైన్ (అంచులో) గ్రీన్ చిప్పు పెట్టాలి. పింక్ రంగు చిప్పు తల దగ్గర నుంచి ఒక మేకు కొట్టి పైకి అల్లిన భాగంలో పెట్టాలి. గ్రీన్ చిప్పు నెమలి ఫించం మొదటి భాగంలో పెడితే, చిత్రంలో చూపిన, ఆకర్షణీయమైన నెమలి చిత్రం ఏర్పాటవుతుంది - అంటున్నారు కుమారి అరుణిమా బోస్.

- మల్లిడి సత్తిరెడ్డి